www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 22 డిసెంబర్ 2024
5
తూర్పుగోదావరి



ఫసల్ బీమా యోజనను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి –రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో రైతులకు సంబంధించిన ఫసల్ బీమా యోజన పథకం ద్వారా వర్తించే నోటిఫైడ్ క్రాప్స్ వరి, మొక్కజొన్న పంటలకు ప్రభుత్వం పంట బీమా సౌకర్యం కల్పించిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు పేర్కొన్నారు. ఈ రబీ సీజనుకు రైతులు వరి పంటకు ప్రీమియం రూ.630, మొక్కజొన్న పంటకు రూ.540 చెల్లించే నిమిత్తం, లోన్‌తో సంబంధం లేకుండా ఈ అవకాశం కల్పించిందని తెలిపారు. ఈ ప్రీమియం చెల్లించేందుకు గడువు తేదీ 31.12.2024గా నిర్ణయించినట్లు తెలిపారు. పంట రుణం తీసుకున్న రైతులకు ప్రీమియం సొమ్మును పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేందుకు బ్యాంక్ సిబ్బందికి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 31న పూర్తి స్థాయిలో పోర్టల్‌లో అప్‌లోడ్ చేయటమే కాక ఆఫీసులకు తగు ఉత్తర్వులు ఇవ్వాలని సూచించారు.

బియ్యం దొంగలను ఎందుకు పట్టుకోలేదు?

- సిపిఎం బహిరంగ సభలో రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- పెద్దాపురంలో కాకినాడ జిల్లా మహాసభ ప్రారంభం
- భారీ ప్రదర్శనతో ఎరుపెక్కిన పట్టణం, ఆకట్టుకున్న కళారూపాలు



బహిరంగ సభకు హాజరైన ప్రజలు,ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి – కాకినాడ ప్రతినిధి, పెద్దాపురం

సినిమా డైలాగు మాదిరిగా 'సీజ్ ద షిప్' అన్న డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ రెండు నెలలుగా బియ్యం దొంగలను ఎందుకు పట్టుకోలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. కాకినాడ జిల్లా సిపిఎం 24వ మహాసభలో భాగంగా శనివారం పెద్దాపురంలో భారీ ప్రదర్శన, అనంతరం ఆంజనేయస్వామి గుడి సెంటర్లో బహిరంగ సభ జరిగింది. సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. దేశాన్ని పాలిస్తున్న మోడీ అభివృద్ధిని పక్కన పెట్టి అదానీ 'సేవ'లో మునిగిపోతున్నారు. చివరకు సూర్యరశ్మిని కూడా అదానీకి అమ్ముకున్నారన్నారు. విద్యుత్ బిల్లులు, పన్నుల భారాలు మోపుతూ ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షాను ప్రధాని స్థానంలో ఉన్న మోడీ వెనకేసుకుని రావడం శోచనీయమన్నారు. కార్పొరేట్ పెట్టుబడిదారులకు లాభాలను చేకూర్చేందుకు జమిలి ఎన్నికలను తెరపైకి తీసుకొస్తున్నారన్నారు. జమిలి ఎన్నికల వల్ల రాష్ట్రాలు ఉనికిని కోల్పోతాయన్నారు.

పిఠాపురంలో పవన్ కళ్యాణ్‌ను గెలిపించుకుంటే జిల్లా అంతా పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుందని ప్రజలు విశ్వసించారన్నారు. అయితే ఆరు నెలలు దాటినా ఎక్కడా అభివృద్ధి జాడలేదన్నారు. కాకినాడ పోర్టు నుంచి బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని నిలదీశారు. ఒక్కరి పైన కూడా కేసును ఎందుకు నమోదు చేయలేదన్నారు. యాంకరేజ్ పోర్టును మూసివేసి ప్రైవేట్ వ్యక్తులకు లాభాలు చేకూర్చేందుకు ఈ డ్రామాలు ఆడుతున్నారా అని ప్రశ్నించారు. కార్మికుల పొట్టను కొట్టి పోర్టును మూసివేసే కుట్రలు మానుకోవాలన్నారు. అధికారంలోకొస్తే పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పిస్తామని, పరిశ్రమలను తీసుకొస్తామని ప్రజల ఆదాయాన్ని పెంచుతామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. కాని ఇలాంటి చర్యలేవీ నేటికీ తీసుకోలేదన్నారు.

సనాతన ధర్మం పేరుతో పవన్ కళ్యాణ్ కొత్త నాటకానికి తెరలేపారన్నారు. ప్రజలు బిజెపి మతోన్మాద



సిపిఎం జెండాను ఆవిష్కరిస్తున్న దారపురెడ్డి సత్యనారాయణ



ప్రదర్శనలో పాల్గొన్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

రాజకీయాలపై ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. టిడిపి, వైసిపి, జనసేన వైఖరిలని గమనిస్తూ ఉండాలన్నారు. మోడీకి లొంగిపోయిన ప్రతి పార్టీ పక్కకు పోయాయని తెలిపారు. మోడీకి వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీలే నిలబడ్డాయన్నారు.

కమ్యూనిస్టు ఉద్యమానికి పెద్దాపురం పెట్టింది పేరు

1950 నుంచి పెద్దాపురం ప్రాంతం కమ్యూనిస్టు ఉద్యమానికి పెట్టింది పేరన్నారు. యాసలపు సూర్యారావు వంటి కమ్యూనిస్టు నాయకులు ఇక్కడ పోరాడిన చరిత్ర ఉందన్నారు. పెద్దాపురంలో ప్రజలు అనేక సమస్యలపై పోరాడుతున్నారని గుర్తు చేశారు. పెద్దాపురంలో 30 పడకల ఆసుపత్రి 100 పడకల స్థాయికి తీసుకువెళతామని హామీ ఇచ్చిన పాలకులు నేడు పట్టించుకోవడం లేదన్నారు. ఏలేరు ఆధునికీకరణ మాట మరిచారన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి ఈ మహాసభలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు.

సిపిఎం జిల్లా కన్వీనర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఏలేరు ఆధునికీకరణ లేక రైతులు నష్టాలకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల సాగో, చక్కెర ఫ్యాక్టరీలు మూతబడ్డాయన్నారు. సిపిఎం మహాసభల్లో ప్రత్యామ్నాయ విధానాలను చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామన్నారు. సిపిఎం జిల్లా నాయకులు జి.బేబిరాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విభజన హామీల మాట మరిచిందన్నారు. స్కీం వర్కర్ల సమస్యలను పట్టించుకోవట్లేదన్నారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, రక్షణ, ఆరోగ్య సౌకర్యాలు కరువయ్యాయన్నారు. జీడీ పిక్కల పరిశ్రమల కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు.

సిపిఎం మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ పెద్దాపురం పట్టణంలో జనాభా పెరుగుతున్నప్పటికీ సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూడం లేదన్నారు. సభకు సిపిఎం నాయకులు సూరిబాబు ఆహ్వానం పలకారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి.నాగేశ్వరరావు, నాయకులు దువ్వా శేషబాబ్జి, కెఎస్ శ్రీనివాస్, కరణం ప్రసాదరావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కూనిరెడ్డి అరుణ తదితరులు పాల్గొన్నారు.

బలమైన వర్గపోరాటాలు నిర్మించాలి

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు



ప్రతినిధుల సభలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

రానున్న రోజుల్లో బలమైన వర్గపోరాటాలను నిర్మించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సిపిఎం కాకినాడ జిల్లా మహాసభలో భాగంగా శనివారం నిర్వహించిన ప్రతినిధుల సభలో ఆయన మాట్లాడారు. కేంద్రం నుంచి నిధులను తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను అడ్డుకోవాలన్నారు. విద్యుత్ సంస్కరణలు, విద్యుత్ భారాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్మార్ట్ మీటర్ల కలిగే అనర్థాలను, అదానీ కోసం పనిచేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను విస్తతంగా క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలన్నారు. మోడీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ సిద్ధాంతంలో భాగంగా జమిలి ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకొచ్చిందన్నారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకు అంబేద్కర్ అంశం తీసుకొచ్చారన్నారు. పార్లమెంటులో జరుగుతున్న పరిణామాలను అందరూ గమనించాలన్నారు. భారత రాజ్యాంగాన్ని తుందలో తొక్కే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఏదొక రూపంలో జమిలి బిల్లును నెగ్గించుకోవడానికి ప్రయత్నం జరుగుతుందన్నారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీలో మెజారిటీ సభ్యులు బిజెపికి అనుకూలంగా ఉన్నవారే ఉన్నారన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బిజెపి ఏజెండాను రాష్ట్రంలో అమలు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ మహాసభకు కరణం ప్రసాదరావు, జి.బేబిరాణి, సిహెచ్.రమణి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. తొలుత సభా ప్రాంగణంలో సిపిఎం పతకాన్ని సిపిఎం సీనియర్ నాయకులు దారపురెడ్డి సత్యనారాయణ ఆవిష్కరించారు. అలాగే సంతాప తీర్మానాన్ని కెఎస్.శ్రీనివాస్ ప్రవేశాఎట్టారు. . ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ నాయకులు ఎవి నాగేశ్వరరావు, జిల్లా నేతలు ఎం.రాజశేఖర్, కె.శ్రీనివాస్, శేషబాబ్జి, బేబిరాణి, కె.ప్రసాద్, ఎన్.సూరిబాబు, డి.క్రాంతికుమార్ పాల్గొన్నారు.



ఆకట్టుకున్న కళారూపాలు

మహాసభలో ప్రజానాట్య మండలి కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విప్లవగీతాలు ఉత్సాహాన్ని రేకెత్తించాయి. కళాకారులు రొంగల వీర్రాజు, డి.కృష్ణ, ఎం.రాంబాబు, డి.సత్యనారాయణ, జె.శ్రీను, కే.నాగు, మాగాపు నాగు, లోవరాజుల బృందం ఆలపించిన గీతాలు ఉత్తేజాన్ని నింపాయి. ఎస్‌కె.గౌస్ మొహిద్దిన్, నియాజుద్దీన్, సిహెచ్.వీరబాబు, ఎ.లేఖ్య, వై.లీలా కుమారి, సూర్య కళ, పూజిత, దుర్గాదీపిక, బంగారు రాజు, సూర్య అఖిల ల బృందం ప్రదర్శించిన కళారూపాలు కట్టిపడేశాయి. ప్రజల్లో ఆలోచనను రేకెత్తించాలి.



22న ఎపిపిఎస్‌సి శాఖాపరమైన పరీక్షలు

ప్రజాశక్తి –రాజమహేంద్రవరం రూరల్

ఎపిఎస్‌పి ద్వారా శాఖా పరమైన పరీక్షల నిర్వహణపై డిఆర్ఒ సీతారామ మూర్తి శనివారం సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ పరీక్షను డిసెంబర్ 22న నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. రాజమహేంద్రవరం రాజీవ్ గాంధీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్సిటిట్యూట్స్‌లో నిర్వహిస్తున్న శాఖాపరమైన పరీక్షలకు హాజరయ్యే వారు తప్పనిసరిగా హాల్‌టికెట్, ఫోటో గుర్తింపు కార్డుతో అరగంట ముందే పరీక్షా కేంద్రంలోకి రావాలన్నారు. ఒక్క నిమిషం ఆలస్యం అయినా అనుమతించబోమని తెలిపారు. పరీక్ష ఉదయం 10.00 గంటల నుంచి 12.00 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. కన్వెన్షనల్ టైప్ పరీక్షలు 10.00 గంటల నుంచి 12.00 గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. పరీక్ష కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, తగిన పోలీసులు సిబ్బందిని నియమించాలని, నగర పాలక సంస్థ శానిటేషన్, తాగునీరు ఏర్పాటు చేయాలని, మెడికల్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు, అత్యవసర మందులు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎపిఎస్‌పి ఎస్ఒ జె.యశోద, ఎస్ఐ జి.పరశురామ్, ఎంపిహెచ్ఒ కె.సురేష్ బాబు, విద్యుత్ శాఖ డిఇ డి.శ్రీనివాసు, తహశీల్దారు సిహెచ్.పాపారావు పాల్గొన్నారు.

రాజ్యాంగం, ప్రజల సంపదను పరిరక్షించాలి

ప్రజాశక్తి – నిడదవోలు

భారత రాజ్యాంగం, ప్రజల సంపదను పరిరక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ పిలుపు ఇచ్చారు. సిపిఎం నిడదవోలు పట్టణ మహాసభలో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లయిన సందర్భంగా భారత పార్లమెంట్‌లో రాజ్యాంగంపై చర్చ జరుగుతోందని తెలిపారు. ఆ సందర్భంగా కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. స్వాతంత్ర భారతంలో రాజ్యాంగం ఆధారంగా అందరికీ సమాన హక్కులు, అవకాశాలు, స్వేచ్ఛ కల్పించబడ్డాయని అటువంటి రాజ్యాంగ రూపశిల్పిని స్మరించడంలో ఎందుకు అభ్యతరం ఉండాలని ప్రశ్నించారు. ప్రజలకు హక్కులు హరించే మనుధర్మాన్ని తగులబెట్టి అందరికీ సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగం, రాజ్యాంగం నిర్మాత అంబేద్కర్ అంటే ఆర్ఎస్ఎస్‌కు, మను వాదులకు గిట్టదని మరోసారి పార్లమెంట్ సాక్షిగా అమిత్‌షా నిరూపించారన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి కమ్యూనిస్ట్‌లు పోరాటం చేయాల్సిన పరిస్థితిలో ఉన్నామని అందుకు సిద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు. ప్రజల ఉమ్మడి సంపద అయిన ప్రకృతి వనరులను, ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, అదానీలకు బిజెపి ప్రభుత్వంలో మోడీ, షాలు దోచిపెడు తున్నారని తెలిపారు. దీని ఫలితంగా ప్రజల ఆదాయాలు తగ్గి ఆకలి చావులు, పేదరికం, నిరుద్యోగం, అసమానతలు రోజు రోజుకూ పెరుగుతున్నాయని అన్నారు. 10 సంవత్సరాల కాలంలో ఒక చిన్న పెట్టుబడిదారుడుగా ఉన్న అదానీ దేశంలో నెంబర్ 1 సంపన్నుడుగా, ప్రపంచంలో నెంబర్ 3గా ప్రజల సంపదను దోచుకోవడం ద్వారా అవతరించడని తెలిపారు. ప్రజల సంపదను దోచిపెట్టి, తిరిగి ప్రజలపై ధరల, విద్యుత్ వంటి బారాలను మోడీ ప్రభుత్వం మోపడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై సిపిఎం నిరంతరం పోరాడుతోందని, పోరాటలకు భవిష్యత్‌లో ప్రజలను ఎక్కువగా సమీకరించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జువ్వల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్

సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి –రాజమహేంద్రవరం

నగరపాలక సంస్థలో పనిచేసే సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. శనివారం ఆయన నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ విభాగాలను పరిశీలించారు. వార్డు సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. రికార్డులను పరిశీలించారు. పథకాల అమలులో ఎటువంటి లోపాలూ లేకుండా చూసుకోవాలని, ప్రజలకు సరియైన పద్ధతిలో విషయాలు వివరించాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ చేపట్టిన వివిధ సర్వేల ప్రగతిని సంబంధిత యాప్‌ల ద్వారా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ శ్రీ అబ్దుల్ మాలిక్ అస్ఫర్, సూపరింటెండెంట్ రవికుమార్ పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

ఘన వ్యర్థాల నిర్వహణలో నగరానికి అవార్డు

ప్రజాశక్తి –రాజమహేంద్రవరం

ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణలో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు అవార్డులు లభించడం సంతోషంగా ఉందని కమిషనరు కేతన్ గార్గ్ పేర్కొన్నారు. ఢిల్లీలో సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును అందించగా, కార్పొరేషన్ తరపున మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎ.వినూత్న అవార్డు అందుకున్నారు. ఇది 24 రాష్ట్రాల నుండి 100 పట్టణ స్థానిక సంస్థలలో నగరాన్ని శానిటేషన్ పరంగా నగరాన్ని మార్పు చేసే విధంగా వివిధ కార్యక్రమాలు చేపట్టినందుకు నగరపాలక సంస్థను చేంజ్ మేకర్‌గా గుర్తించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుండి రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ మాత్రమే ఈ అవార్డుకుపై అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు.



కమిషనర్‌కు అవార్డు చూపుతున్న అధికారులు

శ్రీనివాసరావు కుటుంబానికి యుటిఎఫ్ సాయం

ప్రజాశక్తి – ఉండ్రాజవరం

ఇటీవల గుండెపోటుతో మరణించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ వేండ్ర శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి నుంచి రూ.లక్షలు అందజేసినట్లు పాఠశాల హెచ్ఎం కెఎస్‌కె.మాణిక్యాలరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఆయన మృతి యుటిఎఫ్‌కు తీరని లోటని, ఒక మంచి ఉపాధ్యాయుని కోల్పోయామని తెలిపారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి బొర్రా గోపి మూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణ కుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్, జిల్లా సహాధ్యక్షుడు ఐ.రాంబాబు, జిల్లా ఆడిట్ కన్వీనర్ సిహెచ్.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి వివి.రమణ, జిల్లా కుటుంబ సంక్షేమ పథక కార్యదర్శి కెవిఎస్.ప్రకాశరావు, రాష్ట్ర కౌన్సిలర్ పివి.రాముడు, మండల అధ్యక్షుడు వైవి.స్వామి, మండల ప్రధాన కార్యదర్శి బి.రామారావు, గౌరవాధ్యక్షుడు ఎస్.లక్ష్మీనారాయణ, కుటుంబ సంక్షేమ పథక డైరెక్టర్ ఆర్ఎస్ఆర్.ఫణి, తాతా రెడ్డి, ఎం.వెంకటలక్ష్మి, మీరా బీబీ, కె.రామకృష్ణ, చివటం, మోర్త, సూర్యారావుపాలెం హెచ్ఎంలు ఏడు కొండలు, శ్రీనివాస్, పాల్ ప్రకాశం పాల్గొన్నారు.



కుటుంబానికి చెక్కు అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

పరిశ్రమల అభివృద్ధికి సానుకూల నిర్ణయాలు

ప్రజాశక్తి –రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో పరిశ్రమల అభివద్ధికి అధికారులు సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నేపథ్యంలో పరిశ్రమలకు సంబంధించి పారిశ్రామికవేత్తలతో వర్క్ షాప్ ఏర్పాటు చేయాలన్నారు. పరిశ్రమలకు చెందిన జిఒ నెంబర్ 75ను అనుసరించి జిల్లాలో ఉన్న 92,980 విద్యుత్ కనెక్షన్‌లకు మంజూరు చేసినట్లు తెలిపారు. మరోసారి సర్వే చేసి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా ఎంటర్‌ప్రైజెస్ వివరాలను సేకరించే కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 22,650 ఎంటర్‌ప్రైజర్స్ వివరాలను సచివాలయ ఉద్యోగులు నమోదు చేశారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి ఆర్.శ్రీవనిధర్, పరిశ్రమ శాఖ ఎడి పి.ప్రదీప్ కుమార్, ఐపిఒ టివి.ప్రకాష్ పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి –చాగల్లు

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలల్లో భాగంగా స్థానిక విద్యుత్ కార్యాలయ సిబ్బంది జిల్లా పరిషత్ విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులలో ఇంధన పొదుపు గురించిన అవగాహన కల్పించే నిమిత్తం కళాజాతా వారిచే బుర్రకథ ప్రదర్శన ఇప్పించారు. డిఇఇ ఎం.కృష్ణ నాయక్ మాట్లాడుతూ విద్యుత్ తదితర ఇంధనాలను పొదుపుగా వాడితేనే భవిష్యత్ తరాలకు అవసరమైన సహజ వనరులు మనం అందించగలమని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన టివి.సూర్యవతి, లత టీచర్లను కృష్ణ నాయక్ అభినందించారు ఈ కార్యక్రమంలో ఎఇ ఎస్.త్రిమూర్తులు. జెఇ శ్రీనివాసరావు, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ కొటారు గోపాల్ కృష్ణ, హెచ్ఎం మోహన్ కృష్ణ, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు

కార్టూ'నిజం'



కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన

ప్రజాశక్తి– రాజానగరం, పెరవలి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్, సిపిఎం న్యూడెమోక్రసీ, దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివానం అన్నదాన సత్రం నుంచి ర్యాలీ నిర్వహించారు. గాంధీ బొమ్మ సెంటర్‌లో అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జనిపల్లి సత్తిబాబు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కుతో అమిత్ షా మంత్రి పదవుల్లో కొనసాగుతున్నారని, అంబేద్కర్ అవమానించిన వారికి ఆ పదవిలో కొనసాగే అర్హత లేదని వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పిడి శ్రీను మాట్లాడుతూ సాధారణ వ్యక్తికి ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి పదవులు వచ్చాయి అంటే దానికి బిఆర్ అంబేద్కర్ కారణం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు గుబ్బల ఆదినారాయణ, మాజీ ఎంపిటిసి ప్రత్తి నాగేశ్వరరావు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి కో కన్వీనర్ మేకల లక్ష్మీపతిరావు, వేగి దేవానందం తదితరులు పాల్గొన్నారు.



పెరవలిలో నిరసన తెలుపుతున్న బిఎస్‌పి నాయకులు

పెరవలి తహసీల్దార్ కార్యాలయం వద్ద బిఎస్‌పి నాయకులు ధర్నా చేశారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించిన మంత్రి అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ తహశీల్దారు డి.అచ్యుత కుమారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో గుమ్మాపు చిత్రసేన్, సిర్రా రాజు, ఏలూరి అశోక్ కుమార్, చల్లాబత్తుల సత్యనారాయణ, బయ్యే మునీంద్ర, వెన్నపు సుధాకర్, బద్దా జాన్, అంబటి పుల్లారావు, గుడపాటి వెంకటేశ్వర్లు, మల్లపు నాగరాజు, పేర్ల చిరంజీవి, బద్దా ప్రసాద్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి సదస్సులు

ప్రజాశక్తి–చాగల్లు, పెరవలి

రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయిలో భూముల సమస్యలను పరిష్క రిం చేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహశీల్దారు ఎం.మెరికమ్మ అన్నారు. శని వారం చంద్రవరం పంచా యతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్ర మంలో గ్రామ ఉప సర్పంచ్ కోడూరు కాశి గంగాధరరావు, రెవెన్యూ సిబ్బంది టి.శ్రీనివాస్ అధికారులు పాల్గొన్నారు. పెరవలి మండలం కానూరులో రెవిన్యూ సదస్సులో మండల ప్రత్యేకాధికారి ఆర్.వెంక టరమణ నాయక్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాతంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో ఎస్‌సి కాలనీని సందర్శించి లబ్ధిదారుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భావన మధు పూర్ణచంద్, తహశీల్దారు డి.అచ్యుత కుమారి, ఉప సర్పంచ్ నరసింహమూర్తి, అనపర్తి సత్తిపండు, రెవెన్యూ అధికారి పావని, పంచాయతీ కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.



చాగల్లు సదస్సులో మాట్లాడుతున్న మెరికమ్మ

అంగన్‌వాడీ కేంద్రాలకు కంచాల అందజేత

ప్రజాశక్తి– నిడదవోలు

రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు ఆధ్వర్యాన అంగన్‌వాడీ కేంద్రాల పిల్లకు శనివారం స్టీల్ లంచ్ ప్లేట్లు, స్టీల్ వాటర్ గ్లాసులు అందజేశారు. మిడ్ టౌన్ క్లబ్ అధ్యక్షుడు గుబ్బల సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో విపర్తి నాగేశ్వరరావు ఆర్థిక సహకారంతో వీటిని సమకూర్చారు. రావిమెట్ల అంగన్వాడీ, శంకరాపురం అంగన్వాడీ కేంద్రాల్లో వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంజే శేఖర్, పెచ్చెట్టి ఫణిసింహ, డి.శివనాగరాజు అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



అంగనాడీ కేంద్రంలో గ్లాసులు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

నేరాలు ఘోరాలు

బీరువా పడి చిన్నారి మృతి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ గ్రామంలో చెక్క బీరువా పడి చిన్నారి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పాడ గ్రామంలో ఉన్న చర్చ్ ఫాదర్ జేసుదాస్ కూతురు, మనవరాలు కొంతకాలంగా ఉప్పాడ చర్చి ఆవరణలో ఉన్న ఇంటిలో ఉంటున్నారు. శనివారం ఉదయం జె.జయకీర్తన(3)పై బీరువా పడడంతో తీవ్రంగా గాయపడింది. కొత్తపల్లి పిహెచ్‌సిలో ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్‌కు తరలించాలని వైద్యులు తెలిపారు. దీంతో 108కు సమాచారం ఇచ్చారు. గంట ఆలస్యంగా వచ్చిన 108లో కాకినాడకు తరలించే క్రమంలో ఆ చిన్నారి మార్గమధ్యలో మృతి చెందింది. 108 వాహనం సమయానికి వచ్చి ఉంటే చిన్నారి ప్రాణాలు పోకుండా ఉండేవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

1,200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ స్టేషన్ పరిధి సూరంపాలెం రహదారిలో తవుడు ఫ్యాక్టరీ వెనుక పరిసరాలలో శనివారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో భాగంగా 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ చిట్టిబాబు పాల్గొన్నారు.

మోటార్ వైర్ల అపహరణ

ప్రజాశక్తి-కడియం

కడియపులంక పంచాయతీ పరిధిలోని వెంకాయమ్మపేట, బుర్రిలంకలో రెండు రోజులుగా రాత్రి సమయంలో మోటార్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించడంతో నర్సరీ రైతులు గగ్గోలు పెడుతున్నారు. వెంకాయమ్మ పేట నుండి కడియం వెళ్లే రోడ్డులోని పలువురు రైతుల నర్సరీల్లో ఇప్పటికే వైర్ల దొంగతనాలు జరగడంతో రైతులు నర్సరీ అసోసియేషన్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు ఆధ్వర్యంలో దొంగతనాలు జరిగిన నర్సరీలను పరిశీలించారు. అనంతరం కడియం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి గాద నాగేశ్వరావు, డైరెక్టర్లు రావిపాటి రామకృష్ణ, తాడాల బాలమురళీకృష్ణ, పిల్లా శ్రీనివాస్, తాడాల నాగేశ్వరావు, పిఆర్ఒ గరగ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

90 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - కోరుకొండ

కోరుకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ పోలీసులు సారా బట్టీలపై దాడి చేసి 90 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ జె.శ్రీనివాస బాలాజీ తెలిపారు. గాదరాడ, కణుపూరు గ్రామాల్లో సుమారు 2400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. తిరుమలాయపాలెం అటవీ ప్రాంతంలో నాటు సారా స్థావరాలను ధ్వంసం చేసి 7 వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 90 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఎక్సైజ్ పోలీసులు జి.నూకరాజు, ఎ.సతీష్, పి.అనుశ్రీ పాల్గొన్నట్టు తెలిపారు.

బైకుల దొంగ అరెస్టు
10 బైకుల స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

బైకులను అపహరిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 10 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు కొవ్వూరు డిఎస్‌పి జి.దేవకుమార్ తెలిపారు. సిఐ సత్య కిషోర్, ఎస్ఐ డి.రామ్ కుమార్, సిబ్బందితో కలిసి నిడదవోలుకు చెందిన బండారి రామును అరెస్టు చేసినట్టు తెలిపారు. అతడు సీతానగరం మండలం ఉండేశ్వరపురంలో నివాసం ఉంటున్నాడు. రాముపై వివిధ పోలీస్ స్టేషన్లలో 14 కేసులు ఉన్నట్టు తెలిపారు.

వంగలపూడిలో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి - సీతానగరం

వంగలపూడిలోని సాయిబాబా గుడి వీధి వద్ద పిడబ్ల్యుడి కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామ్ కుమార్ తెలిపారు. సుమారు 50 ఏళ్ల వయసుగల వ్యక్తి మృతదేహాన్ని కుళ్లిపోయి గుర్తించని స్థితిలో ఉన్నట్లు తెలిపారు. మృతుని వివరాలు తెలిస్తే 9154875175, 9440904832 నెంబర్లకు తెలపాలని ఎస్ఐ కోరారు.

విద్యార్థులకు సేవా దక్పథం ఉండాలి

ప్రజాశక్తి-గోపాలపురం

చిన్నతనం నుంచే విద్యార్థులు సేవాదక్పథాన్ని కలిగి ఉండడం అభినందనీయమని సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ సిస్టర్ సిల్వి, కరస్పాండెంట్ సిస్టర్ ఎల్సి అన్నారు. శనివారం వేళ్లచింతలగూడెంలోని సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయుల తరపున రూ.1.10 లక్షల సాయాన్ని విజయవాడలో స్నేహ బ్లైండ్ పీపుల్ స్వచ్ఛంద సేవా సంస్థకు వారు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వికలాంగులు, ఎవరూ లేని అభాగ్యులకు చేయూతనిచ్చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, చిన్నతనం నుంచే పిల్లలు సేవా దక్పథాన్ని కలిగి ఉండడం ఆనందదాయకమని అన్నారు.

మాటలు... మంటలు

గోదారి గలగలలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పార్లమెంటు సాక్షిగా కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు జిల్లాలో మంటలు రేగాయి. జిల్లావ్యాప్తంగా ఆందోళనలు మిన్నంటాయి. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిజెపి వైఖరి మరోసారి దర్శనం పట్టాయి. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, దళిత సంఘాలు భగ్గుమన్నాయి. ఈ కార్యక్రమాల్లో పార్టీలకు అతీతంగా ప్రజలు హాజరై తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన గత పదేళ్లలో ఆర్థిక విధ్వంసంతో పాటు సామాజిక సమతుల్యతను దెబ్బతీసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. తాజాగా చేసిన వ్యాఖ్యలు మరింత ప్రకంపనలు సృష్టించాయి. అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలనే డిమాండ్ వ్యక్తమైంది. జిల్లావ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు మిన్నంటుతున్నప్పటికీ కూటమి నాయకుల నుంచి స్పందన కరువైంది. దీంతో ఆయా పార్టీలోనూ చర్చమొదలైంది. ప్రజా ఆందోళనల నేపథ్యంలో కనీసం స్పందించకపోవడం రానున్న రోజులలో ప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ రాకతో జోష్

మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ రాకతో ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వ్యక్తమైంది. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్‌లు, మున్సిపాలటీలు పదవీ కాలం త్వరలో ముగియనున్న నేపథ్యంలో తాజా పర్యటన మరింత ఆసక్తి రేపింది. రాబోయే ఏడాది జులైలో ఎన్నికలు అంటూ తీపికబురు చెప్పడంతో టిడిపి శ్రేణుల్లో అప్పుడే హడావిడి మొదలైంది. ఇప్పటికే కార్పొరేటర్లుగా అనుభవం ఉన్న వారితో పాటు కొత్తగా రాజకీయ రంగంలోకి అడుగుపెట్టిన వారు సైతం తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. తమ అధినేతలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. త్వరలో గోదావరి పుష్కరాలు జరుగనున్న నేపథ్యంలో ఈ ఎన్నికలు మరింత ప్రత్యేకత సంతరించుకుంది. మరోవైపు కాకినాడ కార్పొరేషన్ పరిధిలో విలీన ప్రాంతాల సమస్యలను చక్కదిద్దినట్లయితే కార్పొరేషన్ ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లే. జిల్లాల విభజన అనంతరం జిల్లా కేంద్రాలలో పట్టణ జనాభా సంఖ్య క్రమంగా పెరుగుతున్న విషయం విదితమే. గ్రామాల నుంచి ఉపాధి కోసం వలసలు రావడమే దీనికి కారణం. నూతన పాలక వర్గాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రజల అవసరాలకు తగ్గట్టుగా ఏ మేరకు అభివృద్ధి చేస్తారో వేచి చూడాల్సి ఉంది.

రెవెన్యూ సదస్సులకు దరఖాస్తుల వెల్లువ

భూ సమస్యలను పరిష్కరిస్తామంటూ జిల్లావ్యాప్తంగా అధికార యంత్రాంగం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు దరఖాస్తుల వెల్లువలా వస్తున్నాయి. స్థానిక సమస్యలతో పాటు క్షేత్రస్థాయి సిబ్బంది చేసిన పొరపాట్లు సైతం ఒకొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 33 రోజులలో సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే ఏ మేరకు చొరవ చూపిస్తారో వేచి చూడాల్సి ఉంది. ఇప్పటికే పిజిఆర్‌ఎస్ పేరుతో ప్రతి సోమవారం ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న విషయం విదితమే. ప్రజల విన్నపాలను పూర్తి స్థాయిలో పరిష్కరించకముందే అంకెల గారడీ చేస్తున్నట్లు ఇటీవల రాష్ట్ర కేంద్రమైన అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో తేటతెల్లమైంది. ఈ సవాల్‌ను ప్రభుత్వం ఎలా చక్కదిద్దుతుందో వేచి చూడాలి.

ఉత్సాహంగా సిపిఎం మహాసభలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సిపిఎం శ్రేణులలో ఉత్సాహం నెలకొంది. ఇటీవల డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మహాసభలు పూర్తయిన విషయం విదితమే. తాజాగా కాకినాడ జిల్లా మహాసభలకు రంగం సిద్ధమైంది. రెండ్రోజులపాటు జరిగే ఈ మహాసభలను విజయవంతం చేసేందుకు ఇప్పటికే ఆ పార్టీ శ్రేణులు సిద్ధమయ్యాయి. బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యేలా ప్రణాళికలను రూపొందించారు. తూర్పుగోదావరి జిల్లా మహాసభలకు ఏర్పాట్లు ప్రారంభం అయ్యాయి. ఇటీవల లోగోను ఆవిష్కరించిన విషయం విదితమే.



పోటీలను ప్రారంభిస్తున్న విసి శ్రీనివాసరావు

బెస్ట్ ఫిజిక్, రెజ్లింగ్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-రాజానగరం

నన్నయ యూనివర్సిటీలో ఇంటర్ కాలేజీయట్ బెస్ట్ ఫిజిక్ మెన్ యూనివర్సిటీ టీమ్ సెలక్షన్, రెజ్లింగ్ మెన్ అండ్ ఉమెన్ యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్ పోటీలను విసి ఆచార్య వై.శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ఆధ్వర్యంలో బెస్ట్ ఫిజిక్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ రెజ్లింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల నుండి రెజ్లింగ్ పోటీలకు 45 మంది, బెస్ట్ ఫిజిక్ పోటీలకు 32 మంది క్రీడాకారులు హాజరయ్యారు. విసి ఆచార్య వై.శ్రీనివాసరావు పోటీలను ప్రారంభించి క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ చైర్మన్స్ కె.సుబ్బారావు, డి.జ్యోతిర్మయి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంవిఎస్ఎస్.మూర్తి, అబ్జర్వర్ డి.వి.రమణ, కమిటీ మెంబర్స్ ఆర్‌విఎల్‌కె.రత్నాకర్, శ్రీనివాసరాజు, కె.దుర్గాదేవి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి మాస్టారి సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-కడియం

ఉపాధ్యాయుడు విద్యార్థుల హృదయాల్లో నిలిచిపోవాలని, బోధనే కాదు విద్యార్థుల్ని అన్ని విధాల తీర్చిదిద్దాలని ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ అన్నారు. కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణను పాఠశాల పూర్వ విద్యార్థులు, కడియం, కడియపు సావరం గ్రామ సర్పంచులు, గ్రామపెద్దలు శనివారం ఘనంగా సత్కరించారు. ఆయన తన సొంత డబ్బులు రూ.75 వేలను విద్యార్థుల కోసం ఖర్చు చేశారని, దాతల నుండి సుమారు రూ.15 లక్షలను పాఠశాల అభివృద్ధి పనులకు సేకరించారని హెచ్‌ఎం టి.సత్యనారాయణ తెలిపారు. కడియం సర్పంచ్ మోసిగంటి సత్యవతి, సావరం సర్పంచ్ చెక్కపల్లి మురళీకృష్ణ, పల్ల సుబ్రహ్మణ్యం, పూర్వ విద్యార్థులు పాటంశెట్టి సూరిబాబు, యడ్ల ప్రసాద్, ఉదయ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కడియం

సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కడియం ఎస్ఐ దుర్గాప్రసాద్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని దుళ్ల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ కొండపల్లి పట్టియ్య అధ్యక్షతన సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం ఎస్ఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు ముఖ్యంగా మహిళలు జాగ్రత్త వహించి మోసాల బారిన పడవద్దని సూచించారు. ఈ నేరాలు జరుగుతున్న పద్ధతులపై ఎస్ఐ ఉద్బోధించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ వ్యక్తిగత సమాచారంతో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. బ్యాంక్ ఆన్‌లైన్ మోసాలు సోషల్ మీడియాలో వచ్చే ఫోన్ కాల్స్ లింకులు పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్నారులకు సెల్ ఫోన్లు ఇవ్వద్దని, సెల్ ఫోన్లు వాడకం వల్ల విద్యార్థులు పెడదోవ పడుతున్నారని తెలిపారు. పండగలకు ఇతర కార్యక్రమాలకు ఇళ్ళను విడిచిపెట్టి బయటకు వెళ్ళవలసి వస్తే తమకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. తగిన భద్రత ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడి దేవి నాగేశ్వరరావు, సూరపురెడ్డి భరత్, తోకల శ్రీనివాసు, కట్టుంగ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి ఎం.మహేష్ పలువురు పాల్గొన్నారు.

ఉంగరాల రాము ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-గోకవరం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం సూరంపాలెం ప్రాజెక్టు చైర్మన్‌గా ఉంగరాల రాము ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ మాట్లాడుతూ సీనియర్ నాయకుడు ఉంగరాల రాము రైతు కుటుంబంలో పుట్టి, ఇప్పటికీ కూడా రైతులకు సేవలు అందిస్తూ రాజకీయాల్లో పేరు పొందారన్నారు. వ్యవసాయంలో మంచి అనుభవం ఉన్న వ్యక్తికి ఈ పదవి దక్కడం రైతుకులకు ఎంతో మేలన్నారు. ఉంగరాల రాము మాట్లాడుతూ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతులకు సేవనందిస్తానన్నారు. సుమారు 10 వేల ఎకరాల ఆయకట్టు ఉన్న సూరంపాలెం రిజర్వాయర్ పరిధిలో వేలాది రైతులకు సకాలంలో పంట నీరందించే విధంగా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారి దేవర శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలలో టాయిలెట్స్ ఆధునికీకరణకు విరాళం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం


హెచ్‌ఎంకు నగదు అందజేస్తున్న రాంబాబు

ఉండ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టాయిలెట్స్ ఆధునికీకరణకు కరూర్ వైశ్యా బ్యాంక్ రూ.3 లక్షల విరాళం ప్రకటించినట్లు హెచ్‌ఎం కెఎస్‌కె.మాణిక్యాలరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో దాతలు అందిస్తున్న సాయం, భావి తరాల నిర్మాణానికి ఎంతో దోహదపడి, సమాజానికి ఆదర్శ ప్రాయంగా నిలుస్తోందన్నారు. పాఠశాలలో బాలుర, బాలికల టాయిలెట్స్ బ్లాక్స్ ఆధునికీకరణ నిమిత్తం బ్యాంకు ప్రకటించిన విరాళంతో పాటు స్థానిక సుంకవల్లి ట్రస్ట్ అధినేత, ప్రజా వైద్యులు డాక్టర్ సుంకవల్లి సూర్యనారాయణ, పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఇవ్వల రాంబాబు చెరొక రూ.50,000 విరాళంగా అందజేసినట్టు తెలిపారు. గణిత దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దాతలు విరాళం అందచేశారని ఆయన తెలిపారు. ఈ వితరణ ద్వారా పాఠశాల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని దాతలను అభినందించారు. ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసిన ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ చెరుకూరి దుర్గాప్రసాద్, ఉండ్రాజవరం బౌద్ధ ధమ్మ పీఠాధిపతి బంతే అనాలయోను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

పోషకాహారంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

స్కూల్ హెల్త్, సంక్రమిక, అసాంక్రమిక వ్యాధుల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా ఎంపియుపి స్కూల్ విద్యార్థులకు ఉండ్రాజవరం పిహెచ్‌సి వైద్యాధికారి ఆర్.ఉషా దేవి స్క్రీనింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరికీ బరువు, ఎత్తు, రక్త హీనత నిర్ధారించే పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య విధ్య గురించి అవగాహన కల్పించి, అందరూ పోషక విలువలు ఉన్న ఆహారాన్ని క్రమం తప్పక తీసుకోవాలని సూచించారు. పోషకాహారంతో ప్రతి విద్యార్థీ ఆరోగ్యంగా ఉండటంతో పాటు బాగా చదువుకోవడానికి శక్తిని, మేధా సంపత్తిని కలిగి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.సుబ్రహ్మణ్యం, హెల్త్ అసిస్టెంట్ విజయ్ కుమార్, మహిళా ఆరోగ్యకర్త జ్ఞానేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పి రోజా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐఎస్‌టిఎస్ కళాశాలకు ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి-రాజానగరం

ప్రతిష్టాత్మకమైన ఎగ్జిక్యూటివ్ ఇన్ ఇంజినీరింగ్ కాలేజీ ఫర్ ఉమెన్స్ అవార్డు రాజానగరం సమీపంలో ఐఎస్‌టిఎస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు దక్కింది. దీనిని తెలంగాణా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, తెలంగాణా రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు బంగారు లక్ష్మణ్, ఎంపి ఈటెల రాజేంద్ర, ఎంపి రఘునందన్ ద్వారా కళాశాల చైర్మన్ కె.ఉపేంద్రరెడ్డి, వైస్ చైర్మెన్ అనూష రెడ్డి అందుకున్నారు. ఉపేంద్రరెడ్డి మాట్లాడుతూ విద్యా సంవత్సరం ముగిసే సమయానికి వంద శాతం మెరుగైన ఉద్యోగాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు అందిస్తున్న కృషే కారణమని అభినందించారు.


ఏనుగు మృతికి సంతాపం తెలుపుతున్న అభిరామ్

బాబాజీ ఆశ్రమంలో ఏనుగు మృతి

ప్రజాశక్తి - సీతానగరం

రాపాక పంచాయతీ శ్రీరామనగరం చిట్టి బాబాజీ ఆశ్రమంలో ఏనుగు (లీల) మృతి చెందినట్లు ఆశ్రమ వర్గాలు తెలిపాయి. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి కార్యక్రమాల కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ తనయుడు అభిరామ్ బాబాజీ ఆశ్రమానికి చేరుకుని ఏనుగు (లీల) మృతి పట్ల సంతాపం తెలిపారు. ఆశ్రమ ప్రతినిధి జగ్గుబాబును కలిసి సానుభూతి తెలిపారు. ఈ ఏనుగును 2009లో అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి దోర్జీ ఖండ్ ఆశ్రమానికి బహుమతిగా ఇచ్చారని ఆశ్రమ ప్రతినిధి జగ్గుబాబు తెలిపారు. ఏనుగు మృతదేహానికి అటవీశాఖ అధికారులు, వెటర్నరీ వైద్యులు శవ పంచనామా నిర్వహించారు.

సైబర్ క్రైమ్‌పై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - కోరుకొండ

సైబర్ క్రైమ్‌పై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని, ప్రజలు అవగాహన పెంచుకుని ఆన్‌లైన్ చెల్లింపులు, పాస్‌వర్డ్‌ల వివరాలను గోప్యంగా ఉంచుకోవాలని ఎస్‌పి నరసింహ కిషోర్ తెలిపారు. కోరుకొండ పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, చెక్ పోస్టు ఏర్పాటు దిశగా ఆలోచిస్తున్నామని తెలిపారు. నాటుసారా, కోడిపందేలపై దాడులు చేపడుతున్నామన్నారు.

ఘనంగా రామానుజన్ జయంతి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

జాతీయ గణిత దినోత్సవాన్ని మండలంలోని పాఠశాలల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బౌద్ధ ధమ్మ పీఠాధిపతి బంతే అనాలయో, సుంకవల్లి ట్రస్ట్ డాక్టర్ సుంకవల్లి సూర్యనారాయణ ముఖ్య అతిథిలుగా పాల్గొని ప్రసంగించారు. గణిత ఉపాధ్యాయులు ఆళ్ల సుబ్బారావు, దమయంతి, నూర్జహాన్ బేగం, నాగ జ్యోతి, వెంకటేశ్వర రావు, పద్మజారాణి పాల్గొని, వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. శ్రీనివాస రామానుజన్ సేవలు, గణితం ప్రాధాన్యతను వివరించారు.

ఫిజియోథెరపీపై రెవెన్యూ సిబ్బందికి అవగాహన

ప్రజాశక్తి-గోపాలపురం

శారీరక, మానసిక ఒత్తిడికి లోనైన ప్రతి ఒక్కరికీ శారీరక వ్యాయామ పద్ధతి ఫిజియోథెరపీ ద్వారా ఉపశమనం పొందొచ్చని తహశీల్దార్ కె.అజయ్ బాబు అన్నారు. శనివారం మండల రెవెన్యూ కార్యాలయంలో అధికారులు, సిబ్బందికి ఫిజియోథెరపీపై అవగాహన కల్పించారు. ఫిజియోథెరపిస్టులు ఎ.సంతోష్ కుమార్ బి.రమేష్ మాట్లాడుతూ ఫిజియోథెరపీ చికిత్స ఎంతో ఉపశమనం కలిగిస్తుందని అన్నారు.

ఘనంగా మాజీ సిఎం జగన్ పుట్టినరోజు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను పలుచోట్ల శనివారం ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

చాగల్లులో వైసిపి కార్యాలయం వద్ద దుర్గామల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యాక్రమంలో పార్టీ కొవ్వూరు ఇన్‌ఛార్జి తలారి వెంకట్రావు, ఎంపిపి మట్టా వీరస్వామి కేక్ కట్ చేశారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంచారు. గండ్రోతు సురేంద్ర, జట్టా ఏడుకొండలు, జజ్జవరపు రామచంద్రరావు, సింహాద్రి, జాలం వెంకట్రావు, కె.శ్యామ్ పాల్గొన్నారు.

గోకవరం పాతబస్టాండ్ వద్ద వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్గంపేట ఇన్‌ఛార్జి తోట నరసింహం కేక్ కట్ చేశారు. 100 మంది మహిళలు, వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు.

తాళ్లపూడి కొవ్వూరు ఇన్‌ఛార్జి తలారి వెంకట్రావు మండల కేంద్రమైన తాళ్లపూడిలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, గజ్జరం గ్రామంలో సర్పంచ్ డాక్టర్ గండి రాంబాబు, పెద్దేవంలో సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం వేలివెన్నులో జెడ్‌పిటిసి నందిగం భాస్కరరామయ్య, చివటంలో, వెలగదుర్రులో సర్పంచ్ సాగి పద్మావతి, ఉపసర్పంచ్ కష్ణంరాజు, దమ్మెన్నులో సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ వేడుకలు నిర్వహించారు.

కడియం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, మండల అధ్యక్షుడు యాదల సతీష్ చంద్ర స్టాలిన్ ఆధ్వర్యాన 25 కిలోల కేక్ కట్ చేశారు. వివిధ రకాలైన టన్ను కూరగాయలు, 25 కిలోల ఆకుకూరలతో వైయస్ జగన్మోహన్ రెడ్డి భారీ చిత్రపటాన్ని తయారు చేశారు. దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, చీకట్ల మాచరయ్య, కానుబోయిన సాగర్, సలాది ప్రసాద్ పాల్గొన్నారు.